# కార్మిక సంక్షేమమే అభివృద్ధికి పునాది: కేంద్ర మంత్రి మాండవీయ



విశ్వంభర, హైదరాబాదు : సామాజిక న్యాయం, బాధ్యతాయుతమైన ఆవిష్కరణలు, సార్వత్రిక సామాజిక భద్రతతో కూడిన మానవ హిత ఉపాధి వ్యవస్థను నిర్మించినప్పుడే సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతుంది" అని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అన్నారు. హైదరాబాదులో జరిగిన 15వ బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం--2026 సదస్సును ఆయన ప్రారంభించారు. బ్రిక్స్ దేశాల మధ్య కార్మిక సంక్షేమం, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధి, గౌరవప్రదమైన ఉపాధి, కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో బాధ్యతాయుత విధానాలపై సహకారం పెరగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. భారత్‌లో 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా సరళీకరించడం ద్వారా కార్మిక హక్కులు, కనీస వేతనాలు, వృత్తి భద్రత బలోపేతమయ్యాయని తెలిపారు. గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు అధికారిక గుర్తింపు కల్పించడంతో పాటు ఈ-శ్రామ్ పోర్టల్‌లో 31.7 కోట్ల మంది అసంఘటిత కార్మికులు నమోదు చేసుకున్నారని చెప్పారు. సదస్సులో సామాజిక భద్రత, ఉత్తమ కార్మిక విధానాలు, స్కిల్లింగ్ --అప్స్కిల్లింగ్ --రీ-స్కిల్లింగ్, కృత్రిమ మేధ వినియోగం ప్రధాన చర్చాంశాలుగా నిలిచాయి. ఏఐ మానవ కార్మికులను భర్తీ చేసే విధంగా కాకుండా, అవసరమైన వ్యూహాత్మక, ప్రమాదకర పరిశ్రమల్లో మాత్రమే వినియోగించాలని ప్రతినిధులు అభిప్రాయ పడ్డారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ, ఉద్యోగుల్లో రీ-స్కిల్లింగ్ కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు. తెలంగాణ కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కార్మికుల నైపుణ్యాలను పెంపొందించడం, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం, కార్మిక హక్కుల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బ్రిక్స్ దేశాల అనుభవాలను పరస్పరం పంచుకోవడం ద్వారా కార్మిక సంక్షేమానికి కొత్త మార్గాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం చైర్మన్, భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు సుంకరి మల్లేశం మాట్లాడుతూ, ప్రపంచ జనాభాలో సగం మంది బ్రిక్స్ దేశాల్లోనే ఉన్నందున కార్మిక సంక్షేమం, సామాజిక భద్రత, లేబర్ కోడ్‌ల అమలుపై ఈ సమావేశంలో కీలక చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో: బ్రెజిల్ ప్రతినిధి కార్లస్ అగస్టో ముల్లర్ రష్యా ప్రతినిధి సెర్గీ చెర్నోగాయేవ్ చైనా ప్రతినిధి హుజియాంగ్ ఝూ దక్షిణాఫ్రికా ప్రతినిధి మసలే గాడ్‌ఫ్రే సెలెమత్సేలా ఐఎల్‌వో నిపుణురాలు యూకీ ఒట్సుజీ జస్టిస్ (విశ్రాంత) ఎన్. నగరేశ్ వివిధ బ్రిక్స్ దేశాల ప్రతినిధులు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ కొనసాగించక పోతే ఉద్యమం తప్పదు: ఆర్. కృష్ణయ్య



విశ్వంభర, ముషీరాబాదు : ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయకపోతే బీసీల ఉద్యమం తీవ్రరూపం దాల్చుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాదు ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కొనసాగింపు, పెండింగ్ బకాయిల విడుదల కోరుతూ సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. దీక్షకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి తదితరులు సంఘీభావం తెలిపారు. దీక్ష సందర్భంగా ఆర్. కృష్ణయ్యకు అస్వస్థత కలగడంతో వైద్యులు పరీక్షించి చికిత్స తీసుకోవాలని సూచించారు. అనంతరం మాట్లాడిన ఆయన, బీసీలకు రాజకీయ, విద్యా, సంక్షేమ రంగాల్లో అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి, పథకాన్ని యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాసంస్థల భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, బలహీన వర్గాల విద్యకు భరోసా కల్పించే నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీలం వెంకటేష్ , పగిళ్ల సతీష్ జిల్లపల్లి అంజి మోడీ రాందేవ్ జి. అనంతయ్య, మల్లేష్ యాదవ్, రాజేందర్ శివకుమార్ యాదవ్, నిఖిల్ పటేల్ వంశీ మోహన్ నరేష్ గౌడ్ భీమరాజు పృథ్వి గౌడ్ రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ ఫారాలను తనిఖీ చేసిన కలెక్టర్



విశ్వంభర, మహబూబాబాద్ : బుధవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కురవి మండల కేంద్రంలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎనుమరేషన్స్ ఫార్మ్స్ పంపిణీ చేయడం పూర్తి అయ్యిందని, డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతుందని క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి బూతు లెవల్ అధికారులు వెళ్లి వివరాలు సేకరించి 2002 ఓటరు జాబితా ప్రకారం వివరాలు సేకరించాలని, అందుబాటులో లేని వివరాలను గుర్తించాలని, వేగంగా ఈ ప్రక్రియ మొత్తం కొనసాగాలని ఆదేశించారు, ఇప్పటికే జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులను నియమించి క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగడంలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ విజయ, ఎంపీడీవో వీరబాబు, సంబంధిత అధికారులు ఉన్నారు.

## పెళ్లి రెండు కుటుంబాలను ఏకంచేసే పవిత్ర బంధం



విశ్వంభర, బాగ్‌లింగంపల్లి : పెళ్లి ఇద్దరు వ్యక్తులను మాత్రమే కాకుండా రెండు కుటుంబాలను ఏకం చేసే పవిత్ర బంధం, అలాంటి బంధాలను నిర్మించే మ్యారేజ్ బ్యూరోలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తూ సామాజిక బాధ్యతతో సేవలు అందించాలని మాజీ మంత్రి రాజయ్య అన్నారు. హైదరాబాదు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జై తెలంగాణ ఆల్ మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పాముల రమణ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్రస్థాయి నంది అవార్డులు, జాతీయ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజయ్య మాట్లాడారు. వేలాది కుటుంబాలకు సంబంధాలు కుదిర్చి సామాజిక సేవ చేస్తున్న మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులను నంది అవార్డులతో సత్కరించడం అభినందనీయమన్నారు. వివాహానంతరం కుటుంబాలు ఆనందంగా, స్థిరంగా ఉండేలా మార్గనిర్దేశం చేయడం కూడా మ్యారేజ్ బ్యూరోల బాధ్యతేనని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని మరింత సామాజిక బాధ్యతతో సేవలు అందించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ వంటి సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో అండగా నిలిచాయని రాజయ్య తెలిపారు. జై తెలంగాణ ఆల్ మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పాముల రమణ మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రోత్సాహం తమ సంస్థకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని గుర్తించి భవిష్యత్తులో కూడా అవార్డులతో సత్కరిస్తామని తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన అతిథులు, అవార్డు గ్రహీతలు, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేబి రాజు, రాష్ట్ర మహిళా చైర్మన్ భారతీదేవి, నూతి చంద్రమౌళి, స్వప్న భరత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్‌ను అందజేసి నిజాయితీని చాటుకున్న అధ్యాపకుడు



విశ్వంభర, రామన్నపేట: నల్లగొండ నుండి భువనగిరికి బయలుదేరుతున్న బస్సులో ఉదయం 9 గంటల ప్రాంతంలో చిట్యాల ప్రాంతానికి చెందిన చంద్రు అనే వ్యక్తి తన మొబైల్ ను మరచిపోగా అదే బస్సులో ప్రయాణం చేస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న గ్రంథపాలకులు డాక్టర్ రాచమళ్ళ శ్రీనుకు లభించింది. మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తి వివరాలను ఆరా తీసి మరల ఆ వ్యక్తికి శ్రీను అందజేయడం జరిగింది. వంద రూపాయలు దొరికితేనే ఎవరికీ చెప్పకుండా జేబులో వేసుకొని పోయే వ్యక్తులు ఉన్న ఈ రోజుల్లో సుమారు 15,000 రూపాయల విలువ చేసే మొబైల్ లభించినప్పటికీ దానిని నిజాయితీగా మళ్లీ ఆ వ్యక్తికి అందజేయడం గొప్ప విషయమని పలువురు శ్రీనును అభినందించారు. అభినందించిన వారిలో కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం, అధ్యాపకులు ఉన్నారు.

## నెల్లికుదురు మండలంలో సర్ ప్రక్రియ 63.41శాతం డిజిటలైజేషన్ పూర్తి

తహసిల్దార్ నరేష్



విశ్వంభర, నెల్లికుదురు: సర్ ప్రక్రియ లో భాగంగా నెల్లికుదురు మండలంలో ఓటర్ నమోదు డిజిటలైజేషన్ వేగంగా కొనసాగుతోందని బుధవారం సాయంత్రం వరకు 63.41% కంప్లీటయినట్లు తహసిల్దార్ చంద నరేష్ తెలిపారు. మండలంలోని మేచరాజుపల్లి, నెల్లికుదురు, వావిలాల తో పాటు వీటి పరిధిలోని పీఎస్ లకు చెందిన ఓటర్ నమోదు డిజిటలైజేషన్ ప్రక్రియను తహసిల్దార్ బుధవారం విసిట్ చేశారు. బూత్ స్థాయి పర్యవేక్షకులు,అధికారులు, సహాయకు లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 40 వేల29 ఓటర్లు ఉన్నారని, ఇప్పటివరకు 25వేల387 మంది ఓటర్ల ఫారాలు డిజిటలైజేషన్ చేసినట్లు తెలిపారు. ఇంకా 14 వేల 628 ఫారాలు డిజిటలై జేషన్ చేయాల్సి ఉందని వివరించారు.మండలంలో 18 ఈ ఎఫ్(ధృవీకరణ పెండింగ్‌లో ఉన్న ఓటరు ఫారాలు)155 డీఎస్ఈ (డూప్లికేట్/షిఫ్టెడ్ ఓటర్ల కేసులు),147 ఏఎస్ డి (గైర్హాజరైన, ఇతర ప్రాంతాలకు మారిన లేదా మరణించిన ఓటర్ల కేసులు) నమోదయ్యాయి. వీటిలో డిఎస్ ఈ కు సంబంధించి 16, ఏఎస్ డి కు సంబంధించి 12 కేసుల్లో చర్యలు తీసుకోవాల్సి ఉందని తెలిపారు. ఈనెల 24 వరకు 100% డిజిటలైజేషన్ పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే మండలంలో వేగంగా ఓటర్ నమోదు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. నిర్దేశించిన ఓటర్ నమోదు డిజిటలైజేషన్ ప్రక్రియ లక్ష్యం పూర్తి చేయడంలో బిఎల్వోల పాత్ర కీలకమన్నారు.మండల స్థాయి రాజకీయ పక్షాలు,బి ఎల్ ఏలు, ఓటర్లు బాధ్యతాయు తంగా భాగస్వాములై బిఎల్ఓ లకు సహకరిస్తూ సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సమన్వ యంతో వ్యవహరిస్తే 100% లక్ష్యం సులభతరం అవుతుందన్నారు. సర్ ప్రక్రియకు సంబంధించిన అధికారులు,సిబ్బంది పారదర్శ కంగా వ్యవహరిస్తూ లక్ష్యసాధనకు ఏమరపాటు లేకుండా వేగవంతంగా శ్రమించాలని సూచించారు.

## క్రికెట్ ఆడుతూ.. విద్యార్థి మృతి..!

విశ్వంభర, లింగాపూర్:లింగాపూర్ గ్రామ సమీపంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్లో ఓ విద్యార్థి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. క్రికెట్ ఆడుతుండగా బావిలో పడిన బంతిని తీసుకునే క్రమంలో సాత్విక్(13) అనే బాలుడు మరణించాడు. ఎనిమిదో తరగతి చదువుతున్న సాత్విక్ మరణంతో అతడి తల్లిదండ్రులు అయ్యో దేవుడా ఎంత ఘోరం జరిగిందంటూ గుండెలుబాదుకుంటున్నారు. అంతర్గాం మండలం రామగుండం పోలీస్టేషన్ పరిధిలోని మోడల్ స్కూల్లో జరిగిన ఈ విషాదకరమైన ఘటనతో ఉపాధ్యాయులు, విద్యార్థులు షాక్‌లో ఉండిపోయారు. ఎన్టీపీసీ ఖాజిపల్లికి చెందిన సాత్విక్ లింగాపూర్ గ్రామ సమీపంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం స్కూల్ ఆవరణలో తోటి విద్యార్థులతో కలిసి అతడు క్రికెట్ ఆడుతుండగా బంతి స్కూల్ ప్రహారి గోడ అవతల పడింది. బంతిని పట్టుకోవడానికి ప్రయత్నించిన సాత్విక్ స్కూల్ ప్రహార గోడ ఎక్కాడు. ప్రమాదవశాత్తూ అతడు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడిపోయాడు.

## వరి నాట్లు వేసిన ఉన్నత పాఠశాల విద్యార్థులు

విశ్వంభర, ధర్మారం : పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని స్మార్ట్ కిడ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం వ్యవసాయ క్షేత్ర పర్యటన చేశారు. పాఠశాల షెడ్యూల్లో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను పాఠశాల యజమాన్యం వ్యవసాయ క్షేత్ర పర్యటనకు ధర్మారం శివారులోని పంట పొలానికి తీసుకెళ్లింది. వరి ఎలా పండిస్తారనే విషయాలను సమగ్రంగా పాఠశాల హెడ్‌మాస్టర్ బుధారపు రమాదేవి, కరస్పాండెంట్ బుధారపు మహేందర్ విద్యార్థులకు వివరించారు. సాగు చేయడానికి ముందు రైతులు తాము ఎంచుకున్న విత్తనాలతో వరి నారు పోసి ఎదిగిన అనంతరం కూలీలు నాటు వేస్తారని వారు వివరించారు. నాటు వేసిన తర్వాత ఎరువులు, కలుపు తదితర విషయాలను విద్యార్థులకు వెల్లడించారు. ఆరుగాలం ఎంతో కష్టించి వరి పండించి సమాజానికి ఆహారాన్ని అందిస్తున్న ఘనత రైతులదేనని వారు తెలిపారు. రైతు లేనిదే రాజ్యం లేదని వారే దేశానికి ఆహారాన్ని అందించే వెన్నెముక అని ఈ క్షేత్ర పర్యటనలో విద్యార్థులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరి నాటు వేసే విధానాన్ని తెలుసుకొని విద్యార్థులు వరి నాట్లు వేశారు.

## దివ్యాంగురాలికి వీల్ చైర్ అందజేత

విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన గద్దె విజయ్ నేత



విశ్వంభర, ఎల్బీనగర్ : ఎల్బీనగర్ లోని బి.ఎన్.రెడ్డి డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మల్కాజిగిరి టిడిపి అడ్ హాక్ కమిటీ సభ్యుడు, బి.యన్.రెడ్డి టిడిపి కాంటెస్టెడ్ కార్పొరేటర్ గద్దె విజయ్ నేత ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని100 మంది విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, స్నాక్స్ బిస్కట్స్ ఇతరత్రా సామాగ్రిని విద్యార్థులకు అందజేశారు. దివ్యాంగురాలైన ఐదవ తరగతి విద్యార్థిని అంజలికి వీల్ చైర్ ను అందజేశారు. ఈ సందర్భంగా గద్దె విజయ్ నేత మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా సామాజిక సేవ నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నామని అందులో భాగంగా ప్రతి సంవత్సరం ఎన్జీవోస్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లీడర్ రేతినేని వెంకటేశ్వరరావు , వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షులు మూర్తి , ప్రభుత్వ స్కూల్ హెడ్మాస్టర్ కవిత, డి వై జయమ్మ, లక్ష్మీ ప్రసన్న, మాధవి , విజయలక్ష్మి , లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రశ్నించడం నేర్చుకోవాలి

: మేజర్ జనరల్ (రిటైర్డ్) ఎస్. కె. మాథూర్



విశ్వంభర, బషీర్ బాగ్: విద్యార్థులు ప్రశ్నించడం నేర్చుకోవాలని, అపజయాలను స్వీకరించాలని, క్లిష్ట పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటూ కొత్త కోణంలో ఆలోచించాలని మేజర్ జనరల్ (రిటైర్డ్) ఎస్. కె. మాథూర్ అన్నారు. బుధవారం ఆక్స్ ఫర్డ్ గ్రామర్ హై స్కూల్లో ఘనంగా 16వ ఇన్వెస్టిచర్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మేజర్ జనరల్ (రిటైర్డ్) ఎస్. కె. మాథూర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో మాట్లాడాలని, అలాగే ప్రతి ఒక్కరిపట్ల గౌరవం, సానుభూతితో వ్యవహరించాలని సూచించారు. కష్టపడి పనిచేసి నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునే వారికి ప్రపంచం ఎన్నో అవకాశాలను అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిజాయితీ, పట్టుదల, నిస్వార్థ సేవ వంటి విలువలను ఆచరించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అల్కా మాథూర్, ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ పాఠశాల డైరెక్టర్ ప్రార్థన మణికొండ, కరస్పాండెంట్ కె. ప్రభాకర్, డిన్ రామాంజుల, ప్రిన్సిపాల్ రేఖారావు తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలతో పేదరికం, ఆరోగ్య సమస్యలు

చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డా.పి.అశోక్



విశ్వంభర, నెల్లికుదురు: పేదరికం ఆరోగ్య సమస్యలకు బాల్యవివాహాలు కారణమని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డా. పరికిపండ్ల అశోక్ అన్నారు. మండలంలోని నరసింహుల గూడెం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం బాల్య వివాహాలపై జరిగిన అవగాహన సదస్సులో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డా.పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండకుండా అమ్మాయికి, 21 సంవత్సరాలు నిండకుండా అబ్బాయికి వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, ఎంతటి వారినైనా శిక్షించే హక్కు చట్టాలకు ఉందని హెచ్చరించారు. చిన్న వయసులోనే పెళ్లి చేసుకున్న వారిలోనే గృహహింస అధికమని, స్థూలంగా పరిశీలిస్తే తరాల మధ్య పేదరికం అదే విధంగా కొనసాగింపు ఉండేందుకు, తద్వారా సమాజంలో మహిళలను అట్టడుగు స్థాయిలో ఉంచేందుకు బాల్యవివాహాలు దోహదం చేస్తున్నాయని, చిన్న వయసులో గర్భధారణ, కుటుంబంలో ప్రధాన పాత్ర పోషించాల్సి రావడం వ్యక్తిగతంగా, సమాజపరంగా తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయన్నారు. శిశు మరణాల సంఖ్య, బాల్య మరణాలు, పురిట్లోనే కన్నుమూయడం లాంటి వాటికి బాల్యవివాహాలే కారణమని సమాజం గుర్తించకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలపై రూపొందించిన పోస్టర్లు ఆవిష్కరించి పాల్గొన్న వారిచే బాల్యవివాహాలు చేయనివ్వమని, వారి వారి పిల్లలకు చేసుకోబోమని ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో గద్దె లక్ష్మీనారాయణ, వెంకట రామ నరసయ్య, రామగుట్టలతోపాటు స్థానికులు గిరి,హుస్సేన్ , లక్ష్మణ్,కోటేశ్వర తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 17న చేనేత వస్త్ర ప్రదర్శన




విశ్వంభర, హైదరాబాద్ : వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ , తెలంగాణ ప్రాంత పద్మశాలి మహిళా విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్న చేనేత వస్త్ర ప్రదర్శన ఈ నెల 17,18,19 వ తేదీలలో నారాయణగూడలోని రాజ్ మొహల్లా పద్మశాలి భవన్ లో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రాంత పద్మశాలి మహిళా విభాగం అధ్యక్షురాలు గుంటక రూప సదాశివ్ పత్రిక సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులకు నిరంతరం ఉపాధిని కల్పించే దిశగా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ వస్త్ర ప్రదర్శనలో నేరుగా చేనేత కార్మికుడి నుండి వినియోగదారులకు అందించే విధంగా అమ్మకాలు జరిగేటట్టు చేస్తున్నామని అన్నారు. ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా మంచి నాణ్యమైన గల చీరలను వినియోగదారులకు అందించే విధంగా ఇలాంటి ప్రదర్శన చేపడుతున్నామని అన్నారు. దాదాపు 45 స్టాల్స్ పైగా ఏర్పాటు చేయడంతో పాటు మహారాష్ట్ర , కర్ణాటక , తమిళనాడు , కేరళ ,గుజరాత్ , ఆంధ్రప్రదేశ్ , తెలంగాణలోని గద్వాల , పోచంపల్లి , పుట్టపాక , సిరిసిల్ల , సిద్ధిపేట , వరంగల్ , నారాయణపేట వంటి ప్రాంతాల నుండి చేనేత ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంటాయని అన్నారు. గత రెండు సం.రాలుగా చేపడుతున్న చేనేత వస్త్ర ప్రదర్శనకు మంచి పేరు రావడంతో పాటు మార్కెటింగ్ అలాగే మంచి ఆదాయం వ్యాపారస్తులకు రావడం చాల సంతోషముగా ఉందని అన్నారు. ఈ మూడవ సంవత్సరంలో కూడా చేనేత వస్త్ర ప్రదర్శన ను విజయవంతం చేయాలనీ కోరారు. గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు పోరండ్ల శారదా, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రం, ఉపాధ్యక్షులు గుర్రం శ్రావణ్ నేత, టి.పి.పి.ఎస్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చినకోట్ల స్వప్న రాజ్, కోశాధికారి నోముల రేఖ, అడెపు శాంతి, అర్చన, స్వరూప, ఉపాధ్యక్షులు విజయ, గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు కత్తులు సుదర్శన్, పద్మశాలి సంఘం ఎల్.బి.నగర్ సర్కిల్ యువజన విభాగం అధ్యక్షులు కర్నాటి విజయ్ నేత తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలని నిరసన




విశ్వంభర, హైదరాబాద్: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద తెలంగాణ హైర్ వెహికల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వాధికారులకు అద్దె ప్రాతిపదికన వాహనాలు నడుపుతున్న యజమానులకు కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలుగా బకాయిపడిన సుమారు రూ.170 కోట్ల నిధులను విడుదల చేయాలని వాహనాల యజమానులు డిమాండ్ చేశారు. హైర్ వెహికల్స్ అసోసియేషన్ సమ్మెతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 5 వేలకు పైగా అద్దె వాహనాలు నిలిచిపోయాయి. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రతినెలా ఇవ్వాల్సిన అద్దెను రూ.34 వేల నుంచి రూ.55 వేలకు పెంచాలని, అద్దె బిల్లులు ఐదో తేదీ నుండి పదో తేదీలోపు చెల్లించాలలని కోరారు. బిల్లులు చెల్లించక పోవడంతో డీజిల్ ఖర్చులు, డ్రైవర్ల జీతాలు, వాహనాల ఇన్సూరెన్స్, ఈఎంఐలు చెల్లించలేక సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.